సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER

ఆదివారం ● 18 మార్చి 2018 । సంపుటి : 20 సంచిక : 230 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00 Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad



సంచలన వార్తాపత్రిక
లీడర్ క్లాసిఫైడ్స్

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు. - మేనేజ్‌మెంట్

విశాఖపట్నం | ఆదివారం 18-3-2018

ఆప్త్రానిక్స్ నూతన స్టోర్ ప్రారంభం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ప్రముఖ టాలీవుడ్ నటి కుమారి ప్రణీత డాబా గార్డెన్స్ ప్రాతంలో ఆప్త్రానిక్స్ కు చెందిన రిటైల్ స్టోర్స్ . సర్వీస్ సెంటర్(యాపిల్ ప్రీమియం రీసెల్లర్)ను ప్రారంభించారు. ఈ నూతన స్టోర్‌లో పూర్తి శ్రేణి యాపిల్ ఉత్పత్తులు మాక్‌బుక్స్, ఐమాక్, ఐఫోన్స్, ఐపాడ్స్ యాపిల్ వాచ్‌లు లభిస్తాయని సంస్థ ఎండీ మేషనా సింగ్ తెలిపారు.

సెప్టిక్ ట్యాంకులో పడి నలుగురు మృతి

మరొకరి పరిస్థితి విషమం

విశాఖ జిల్లా నక్కపల్లిలో విషాదం

విశాఖ క్రైం, న్యూస్‌లీడర్: విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో ఎస్సీ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. మరుగుదొడ్డి నీటిలోపడి ఊపిరాడక నలుగురు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమం గా ఉండటంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. మరుగుదొడ్డి ట్యాంకులో నీటిని తోడుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మృతులంతా ఒకే కుటుం బానికి చెందినవారుగా గుర్తించారు. మృతులు కాండ్రకోట కృష్ణ, కాండ్రకోట అప్పారావు, కాండ్రకోట నాగేశ్వరరావు, కాండ్రకోట రాజశేఖర్‌గా తెలుస్తోంది. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




ఏప్రిల్‌లో బ్రాండిక్స్ ఉచిత వైద్యశిబిరాలు

బ్రాండిక్స్ ఇండియన్ పార్ట్నర్ దొరైస్వామి



అచ్యుతపురం, న్యూస్‌లీడర్: మండల కేంద్రం అచ్చుతాపురం లో బ్రాండిక్స్ వారి ఆధ్వర్యంలో ఈనెల 18న జరగాల్సిన మహిళ ఉచిత వైద్య శిబిరాన్ని ఉగాది పండగ వలన రద్దు చేయడం జరిగింది. ఏప్రిల్ మొదటి ఆదివారం, 3వ ఆదివారం ఈ వైద్య శిబిరాలు యధావిధిగా జరుగుతాయని బ్రాండిక్స్ ఇండియన్ పార్ట్నర్ దొరైస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉగాది పర్వదినాన మహిళా ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన వారందరూ ఉగాది పండగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని వారందరికీ బ్రాండిక్స్ఇండియన్ పార్ట్నర్ దొరస్వామి ముందుస్తు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అచ్చుతాపురం మండల కేంద్రంలో పలుచోట్ల నూకాలమ్మ పండగలు మండలంలో ప్రసిద్ధిచెందిన కొండకర్ల అందలాపల్లి మోసయ్యపేట గ్రామాలలో శనివారం భక్తుల వేలాదిగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాల చుట్టూ ప్రత్యేక ప్రదర్శన చేశారు.
గ్రామాలలో వీధులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. గుడి వద్ద సంస్కృత కార్యక్రమాలు చిరతలు భజనలు కోలాహలు ఎడ్ల బండ్లపై పౌరాణిక నాటకాలు ప్రజలను ఆకట్టుకునే విధంగా ఉంటాయి ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈగల అప్పారావు ఉత్సవ కమిటీ ప్రతినిది నాయుడు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


డామిట్ ....కథ అడ్డం తిరిగింది



- అప్పన్న ఆలయంలో అపచారంపై మరో కోణం
- రాజభోగం సమయంలో మహిళే కాదు.. పురుషుడూ ఉన్నాడట..!
- సీసీ పుటేజీలు చెబుతున్నాయంటున్న ఆలయ ఈవో

సింహాచలం, న్యూస్‌లీడర్:

పవిత్ర దేవస్థానమైన సింహాచలం శ్రీ వరాహా లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో అపచారం జరిగిందంటూ ఇటీవల వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో ఈ వ్యవహారం మరో కొత్త మలుపు తిరిగింది. మహిళ రాజభోగం సమయంలో ఆలయ గర్భగుడిలోనే వుందంటూ తీవ్ర దుమారం లేచిన విషయం తెలిసిందే.అయితే ఈమేరకు విచారణ జరిపిన ఆలయ ఈవో కె. రామచంద్రమోహన్ మీడియా సమావేశంలో తెలియచేసిన వివరాల్లో కొత్త విష యాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 12 వ తేదీ ఉదయం 11.39 నుంచి 11.52 మధ్య ఒక మహిళా భక్తురాలు రాజభోగం సమయంలో ఆలయంలోనే వుందని సీసీ పుటేజి తెలుపుతోందని ఈ.ఓరామచంద్రమోహన్ స్పష్టం చేశారు. అయితే ఈ పరిశీలనలో ఇంచుమించు అదే సమయం... అంటే 11.53 నిమిషాలకు ఒక పురుష భక్తుడు (విలేకరి) ఆలయంలోకి ప్రవేశించినట్లు సీసీ పుటేజీలో కనిపిస్తోందని ఈవో రామచంద్రమోహన్ స్థానిక విలేకరులతో పేర్కొనడం చర్చనీయాంశమైంది. ఆయన మాటల ప్రకారం.



రోజూ రాజభోగం 11:30 నుండి 12 గంటల వరకు జరుగుతుంది. ఒక ఐదు నిమిషాలు అటూ ఇటూ అయినా.. పుణ్యాహవ చనం తీర్థంచల్లి ఆరగింపు పెడతారు. తిరిగి 12 గంటలు నుండి 12:05 లోపు భక్తులకు తిరిగి దర్శన భాగ్యం కలుగజేస్తారు. అయితే ఎవరైతే మహిళ 11:52 నిమషాలకు బయటకు వస్తోందని (సీసీ పుటేజి ఆధారంగా) ఇ.ఓ చెబుతున్నారో... అదే సమయం అంటే 11:53 నిమిషాలకు ఒక స్థానిక భక్తుడు లోనికి ప్రవేశించినట్లు వుందని అధికారులు పేర్కొంటున్నారు.ఒక వేల అదే జరిగితే.. 12 గంటల తరువాత భక్తులకు తిరిగి దర్శనం కల్పించవలసిన అధికారులు, వైధికులు 11:53 కి అజ్ఞాత భక్తుడిని ఎలా అనుమతించారనేది సందిగ్ధం నెలకొంది. ఈ విలేకరికి తెలిసే అంతా జరిగిందా? ఆయన అదే సమయంలో లోపలకి ఎందుకు వెళ్ళవలసి వచ్చింది?

12వ తేదీన అపచారం జరిగితే మూడు రోజుల తరువాత మీడియాలో ఎలా వచ్చింది? ఈ లోపు ఆలయంలో ఏవైనా లాబీయింగ్ చేశారా ? ఒక వేళ అది ఫెయిల్ కావడంతో ఈ వివాదం బైటికి వచ్చిందా ? అన్నవిషయమై ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

ఇన్‌ఛార్జ్ ప్రధాన అర్చకుడే కారకుడు

ఆలయంలో జరిగిన అపచారానికి ఆలయ ఇన్‌చార్జ్ ప్రధాన అర్చకుడు గొడపర్తి శ్రీనివాసాచార్యులే ప్రధాన కార కులుగా వైధిక వర్గాల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఆ రోజు మధ్యాహ్నం రాజభోగ సమయంలో భక్తుల దర్శ నాలను నిలిపివేసిన తరువాత ఒక మహిళ శ్రీనివాసా చార్యులు శిష్యురాలుగా చెప్పుకుంటూ నీలాద్రి గుమ్మం ద్వారా ప్రవేశిం చినట్టు చెబుతున్నారు. సీసీ పుటేజి సమ యం ప్రకారం ఉదయం 11.39 కి లోపలికి ప్రవేశించి తిరిగి లోపల మహిళ ఉందని ఒక పరిచారకుడు గుర్తించ డంతో వైదిక స్వాములు బిత్తరపోయారు. ఆమె 11.52 నిమిషాలకు రికార్డు అయ్యింది.కాగా శ్రీనివాసాచార్యులు దేవస్థానం ఎంప్లాయిస్ యూనియన్లో ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్నారు. అయితే ఈయన ఈ వ్యవహారం నుండి బయటపడేందుకు అమరా వతి స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

21న రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యయన కమిటి సమావేశం

గాజువాక : న్యూస్‌లీడర్

రాష్ట్ర వ్యాప్తంగా తెదెపా పాలనలో దళితులపె జరుగుతున్న దాడుల సంద ర్భంగా అధ్యయనం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్న తరుణంలో ఈ నెల 21వ తేదీన విశాఖ వైసిపి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర దళిత వైసిపి సమితి సమావేశానికి వైసిపి దళిత నాయకులు, వార్డు దలిత కార్యకర్తలు, వివిధ స్దాయి నాయకులు హజరుకావాలని గాజువాక వైసిపి సమన్వయకర్త తిప్పల నాగిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో భాగంగా శు క్రవారం గాజువాక వైసిపి కార్యాలయంలో వైసిపి రాష్ట్ర ఎస్సీసెల్ నాయకులు మార్టుపూడి పరదేశి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కటికల కల్పన, కాకినాడ పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.



సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER

Read / Share / Follow
www.leaderepaper.com
www.facebook.com/leaderramanamurthy/
www.twitter.com/leaderramanamurthy/

ఆదివారం • 18 మార్చి 2018 । సంపుటి : 20 సంచిక : 230 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad



దేశం ఏపీ వైపే చూస్తోంది

- అవిశ్వాసానికి మద్దతు కూడగట్టండి
- టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు

అమరావతి : తెదేపా ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి అనేక పార్టీలు మద్దతు పలికాయని.. గంటలోనే సానుకూల స్పందన రావటం జాతీయ స్థాయిలో తెలుగుదేశం విశ్వసనీయతకు మిగతా 7లో ▶

వెంకటేశ్వర్లుపై బిగుస్తున్న ఉచ్చు



- క్రిమినల్ కేసు నమోదు
- వెంటాడుతున్న పాపం
- పట్టుబిగించిన ఐఏఎస్‌లు
- జారీ చేసిన 9 ఆర్డర్లపైనా విచారణ
- ఆందోళనలో రెవెన్యూ యంత్రాంగం

వార్త 7లో

రూ.10కోట్లతో అమ్మవారి ఆలయ అభివృద్ధికి చర్యలు

మంత్రులు అయ్యన్న, సోమిరెడ్డి



అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధిపరిచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పది కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ సీహెచ్ అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మిగతా 7లో ▶



సెప్టిక్ ట్యాంకులో పడి నలుగురు మృతి

వార్త 2లో

రాయలసీమ, కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అరేబియా సముద్రంలో కేరళ తీరానికి ఆనుకొని వాయుగుండం కొనసాగుతోంది. ఉత్తర భారతంలో నెలకొన్న పశ్చిమ ఆటంకాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు మేఘాలు ఏర్పడ్డాయని, వీటి ప్రభావంతో రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశముందని కూడా తెలిపారు. రెండు మూడురోజుల తర్వాత సాధారణ వాతావరణం ఏర్పడుతుందని వెల్లడించారు.

పంచాంగం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిరరుతువు ఫాల్గుణ మాసం శుక్లపక్షం

శ్రీ విళంబి చైత్ర శు. పాడ్యమి సా.6:32 వరకు
ఉత్తరాభాద్ర రా. 8:00 వరకు
వర్జ్యం శేషం ఉ. 6:59 వరకు
దు.ము. సా. 4-24 నుండి 5-18 వరకు
రా.కా. సా. 4-30 నుండి 6-07 వరకు

దౌత్య వివాదం

అరువై ఏండ్లు దాటిన వృద్ధులను, మతస్థిమితం కోల్పోయిన వారిని విడుదల చేసుకోవాలని ఇటీవల విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్ ప్రతిపాదించారు. దీనికి పాకిస్థాన్ విదేశాంగ మంత్రి అనుకూలంగా స్పందించారు. అరువై ఏండ్లు దాటితే విడుదల చేయాలని,పద్దెనిమిది ఏండ్ల లోపు పిల్లలను కూడా విడుదల చేసుకోవాలని ఆయన సూచించారు. జుడిషియల్ కమిటీ విధానాన్ని పునరుద్ధరించుకోవడానికి ఇరుదేశాలూ అంగీకరించాయి. ఇటువంటి సుహృద్భావం వెల్లివిరుస్తున్న తరుణంలో దౌత్యవేత్తల వేధింపుల వివాదం చెలరేగకపోవలసింది. భారత పాకిస్థాన్ దేశాల మధ్య సంబంధాలు మెరుగుప డుతున్న సూచనలు కనిపిస్తున్న దశలో మళ్ళా ఉద్రిక్తతలు రగులడం విచారకరం. వృద్ధులు, పిల్లలు, మతిస్థిమితంలేని ఖైదీలను పరస్పరం విడుదల చేసుకోవాలని రెండు దేశాలు ఇటీవలే అంగీకరించాయి. ఈ సుహృద్భావం నెలకొన్న తరుణంలో దౌత్యవేత్తల వేధింపుల వివాదం పెచ్చరిల్లడం ఆందోళన కలిగిస్తున్నది. ఢిల్లీలోని తమ దౌత్యవేత్తలను, వారి కుటుంబాలను వేధిస్తున్నారంటూ ఆరోపించిన పాకిస్థాన్ సంప్రదింపుల కోసం తమ రాయబారిని పిలిపించుకున్నది. భారత్ కూడా పాకిస్థాన్‌పై ఇటువంటి ఆరోపణలే చేస్తున్నది. ఇస్లామాబాద్‌లోని తమ దౌత్యవేత్తలను, వారి కుటుంబాలను వేధిస్తూ, మరోవైపు తామే బాధితులం అన్నట్టుగా పాకిస్థాన్ చెప్పుకుంటున్నదని భారత్ ప్రత్యారోపణలు చేసింది. దాదాపు రెండు నెలలుగా రెండు దేశాలు ఆరోపణలు చేసుకుంటున్నాయి. వారం రోజులుగా వేధింపులు ఎక్కువయ్యాయని ఇరుపక్షాలూ అంటున్నాయి. శత్రు దేశానికి చెందిన వారయినా సరే, రాయబారికి భద్రత కల్పించడం రాజనీతి. దౌత్యవేత్తలకు అనేక విధాల మినహాయింపులు కూడా ఉంటాయి. **1961** నాటి వియెన్నా ఒడంబడిక దౌత్య సంబంధాల నిర్వచించింది. శత్రుదేశాల మధ్య అయినా, యుద్ధ సమయంలోనైనా దౌత్య మర్యాదలు పాటించడం ధర్మం. అంతర్జాతీయ న్యాయ సూత్రాలు బలపడి, దౌత్యవేత్తలను ఆదరించాలనే సంస్కృతి బలపడిన నేటికాలం లో ఇంకా దౌత్యవేత్తల వేధింపుల ఆరోపణలు రావడం రెండు దేశాల మధ్య దిగజారిన సంబంధాలను సూచిస్తున్నాయి. అత్యవసరమైతే తప్ప, రాయబార కార్యాలయ ప్రాంతం నుంచి బయటకు వెళ్లకండి. దౌత్యసంబంధ నెంబర్ గుర్తింపు ఉన్న వాహనాలలోనే వెళ్ళండి తప్ప ఇతర వాహనాలు వాడవద్దు- ఇదీ భారత విదేశాంగశాఖ ఇస్లామాబాద్‌లోని దౌత్యవేత్తలకు చేసిన తాజా హెచ్చరిక. పాకిస్థాన్‌లో తమ ను, తమ కుటుంబాలను తీవ్రంగా వేధిస్తున్నారని భారత దౌత్యవేత్తలు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి మూడు గంటల సమయంలో అగంత కులు వచ్చి ఇంటి తలుపు తట్టడం, కారులో వెళుతున్నవారిని వెంటాడటం, వీధుల్లో గుర్తుతెలువని వ్యక్తులు అడ్డుపడి కాయించుకొని లొల్లి పెట్టుకోవడం మొదలైన రీతుల్లో వేధిస్తున్నారని దౌత్యవేత్తలు ఆరోపిస్తున్నారు. భారత దౌత్యవేత్తల నివాసాలకు విద్యు త్, నీటి సరఫరాను నిలిపివేశారనేది మరో తీవ్ర ఆరోపణ. భారత కార్యాలయ భవన నిర్మాణ కార్మికులను కూడా వేధిస్తున్న ఆరోపణ ఉన్నది. ఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్యవేత్తలు కూడా వేధింపు ఆరోపణలు చేస్తున్నారు. బడికి పోతున్న తమ పిల్లలను కూడా అటకాయించారని వారు ఆరోపించారు. తమ దౌత్యవేత్తను వేధిస్తున్న వీడియో దృశ్యాలను పాకిస్థాన్ విడుదల చేసింది. దౌత్యవేత్త వాహనం ముందు మరొకరి కారు మెల్లగా నడుస్తూ అడ్డుకోవడం, ఇరువైపులా ద్విచక్రవాహనాలపై గుర్తుతెలియని వ్యక్తులు వెంటపడటం ఈ దృశ్యాలలో ఉం ది. తమ వాహనాలను సోదా చేస్తున్నారని కూడా పాకిస్థాన్ అంటున్నది. ఈ వేధిం పులను ఆపకపోతే దౌత్యవేత్తలను, వారి కుటుంబాలను వెనుకకు పిలిపించు కుంటామని హెచ్చరించింది. క్లబ్బుల సభ్యత్వం గొడవ రెండు నెలలుగా సాగుతు న్నది. ఢిల్లీలోని క్లబ్బులలో తమ దౌత్యవేత్తలకు పది రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారని పాకిస్థాన్ ఆరోపించింది. ఇస్లామాబాద్ క్లబ్బులో తమ దౌత్యవేత్తలకు సభ్యత్వం ఇవ్వడం లేదని భారత్ అంటున్నది. కశ్మీర్ ప్రాంతంలోని అధీన రేఖ దగ్గర ఉద్రిక్తత ఇంకా సడలనే లేదు. అయినా సరే, ఇటీవల రెండు దేశాల జైళ్ళలో మగ్గుతున్న పౌర ఖైదీలను విడుదల చేసుకునే విషయమై ముందడుగు పడ్డది. అరువై ఏండ్లు దాటిన వృద్ధులను, మతస్థిమితం కోల్పోయిన వారిని విడుదల చేసుకోవాలని ఇటీవల విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్ ప్రతిపాదించారు. దీనికి పాకిస్థాన్ విదేశాంగ మంత్రి అనుకూలంగా స్పందించారు. అరువై ఏండ్లు దాటితే విడుదల చేయాలని, పద్దెనిమిది ఏండ్ల లోపు పిల్లలను కూడా విడుదల చేసుకోవాలని ఆయన సూచించారు. జుడిషియల్ కమిటీ విధానాన్ని పునరుద్ధరించు కోవడానికి ఇరుదేశాలూ అంగీకరించాయి. ఇటువంటి సుహృద్భావం వెల్లివిరు స్తున్న తరుణంలో దౌత్యవేత్తల వేధింపుల వివాదం చెలరేగకపోవలసింది.

ప్రాంతీయ భారతి

ప్రజాస్వామ్యంలో పరిణామాలు కొన్నిసార్లు ఆలస్యంగా, కొన్ని సందర్భాల్లో అమిత వేగంతో, హఠాత్తుగా సంభవిస్తుంటాయి. విశేషించి బహుళపక్ష ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎప్పుడు ఏ పరిణామాలు సంభవిస్తాయో చెప్పడం సులభం కాదు. అందువల్లనే కావొచ్చు, జనాభా దృష్ట్యా ప్రపంచంలో ప్రథమ స్థానం (135 కోట్ల జనాభాతో) ఆక్రమిస్తున్న పొరుగుదేశం, మరుగుదేశం (అక్కడంతా మరుగే, రహస్యమే-ఎడ్గార్ స్నో రెడ్ స్టార్ పుస్తకాలను చదివితే వెల్లడవుతుంది) కమ్యూనిస్టు చైనాలో డెబ్బై ఏండ్ల నుంచి ఇప్పటివరకు పార్టీ ఒక్కటే, ప్రభుత్వం ఒక్కటే, దేశాధినేత,ప్రభుత్వం అధ్యక్షుడు, పార్టీ అధ్యక్షుడు ఒక్కడే. ఆయనే జిన్ పింగ్. దేశమంతటా ప్రాంతీయ మనోభావాలకు కాహళులుగా ఉపకరించే ఎన్నో ప్రాంతీయపార్టీలు ఉబికివచ్చాయి. ఈ పరిణామంతో జాతీయ పార్టీల బలం తగ్గి, ముక్కలై అవి ప్రాంతీయపార్టీల స్థాయికి వచ్చాయి. తత్ఫలితంగా, కేంద్రంలో పెత్తనం కోసం పలుపార్టీల కూటములు అవతరించడం అనివార్యమైంది. యూపీఏ, ఎన్డీయే వంటివి. 2014 లోక్‌సభ ఎన్నికల నాటికి వివిధ రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన ముప్పై మూడు ప్రాంతీయపార్టీలు 20 కోట్ల కంటే ఎక్కువ మంది ఓటర్ల, దాదాపు 39 శాతం మంది ఓటర్ల మద్దతు పొందడం (మొదటి స్థానంలో ఉన్న బీజేపీ కంటే ఎక్కువ శాతం ఓట్లు), లోక్‌సభలోని 543 స్థానాల్లో 217 స్థానాలను గెలువడం విశేషం.


ఇక ఆయన ఎన్నేండ్లయినా, ఎన్ని పర్యాయాలైనా అధినేతగా అధికారంలో, పదవిలో కొనసాగవచ్చు, ఇంతకుముందు మావో, డెంగ్ కొనసాగినట్లు. బహుళపక్షాలు మనకు పనికిరావు అన్న క్సిజిన్ పింగ్ సూక్తిని, ఆయన ఇతర సూక్తులను, బోధనల ను చైనా రాజ్యాంగంలో ప్రవేశపెట్టారు. రాజ్యాంగం దండుగ, నా మాటే పండుగ అని కూడా ఆయన రేపు అనవచ్చు. ఇక్కడి సంగతి, ఈ స్వతంత్ర భారతదేశం సంగతి వేరు. ఈ దేశం ప్రజాస్వామ్య వ్యవస్థలో బహుళ పక్షాలు, ప్రాంతీయ శక్తులు ప్రాధాన్యం వహిస్తున్నాయి, దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో, నిర్దేశించడంలో, ప్రజాస్వామ్యం రూపురేఖలను తీర్చిదిద్దడంలో జాతీయ పార్టీలుగా చలామణి అవుతున్న పార్టీలతో పోల్చినప్పుడు ప్రాంతీయపార్టీలు, ప్రాంతీయశక్తులే



కీలకపాత్ర నిర్వహిస్తున్నాయి. డెబ్బై ఏండ్ల తర్వాత ఇటీవల బీజేపీ ఈశాన్య భారతదేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో ఏడింటిలో సామ, దాన, భేద దండోపాయాలతో, గవర్నర్ల అండదండలతో ఎట్టకేలకు అడుగు పెట్టగలిగింది. డెబ్బై ఏండ్ల గెంటివేత, బహిష్కరణ, అస్పృశ్యత తర్వాత ఈశాన్య భారతంలో అడుగుపెట్టే అవకాశం అందివచ్చినప్పుడు ఆనందం అర్ణవం కావడం సహజమే. 35 ఏండ్లు సీపీఐ (ఎం) ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన త్రిపురలో తమ జెండా ఎగురగానే బీజేపీ అధినేత, ప్రధాని మోదీజీ పరవశుడై శూన్యంలో నుంచి శిఖరం అధిరోహించాం అని అన్నాడు. ఇండియా మీడియాలో ఈ మాటలు తాటికాయలంత అక్షరాలతో ప్రచురితమైనాయి. మోదీజీ ఈ మాటలు అన్న ఏడు రోజులకే బీజేపీ శిఖరం నుంచి శూన్యంలోకి, లేక పాతాళంలోకి కూలిపోవలసి వచ్చింది.

ఈశాన్య రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఇటీవల నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర మూడు రాష్ట్రాల్లో బీజేపీని, మోదీజీని కొండెక్కించింది అక్కడి ప్రాంతీ య శక్తులు, ప్రాంతీయపార్టీలు. ఏడు రోజులయిందో లేదో యూపీలో (గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాల్లో), బీహార్‌లో బీజేపీని, మోదీజీని కొండమీది నుంచి కిందకి నెట్టేసింది ప్రాంతీయ శక్తులు, ప్రాంతీయ పార్టీలే! మోదీజీ మెచ్చిమెచ్చి ఎంపిక చేసిన గోరఖ్‌పూర్ ఆదిత్యనాథ్‌జీ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటుచేసి ఇంకా ఏడాది కాలేదు. అప్పు డే యూపీ ప్రజలు (దేశంలో అన్నిటికంటే పెద్ద రాష్ట్రం, 2014 లోక్‌సభ స్థానాల్లో డెబ్బై కంటే ఎక్కువ స్థానాల్లో కండ్లు మూసుకొని బీజేపీని గెలిపించిన రాష్ట్రం)ఆదిత్యనాథ్ అస్తవ్యస్త పాలనతో, అపసవ్య, నకారాత్మక, అసహన ధోరణితో, మోదీజీ వాగాడంబరతతో విపరీతంగా విసిగిపో యి, మొహం మొత్తి గోరఖ్‌పూ ర్, ఫూల్‌పూర్ స్థానాల్లో చావుదెబ్బ కొట్టా రు. తెలంగాణ రాష్ట్రం అవతరించి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నాలుగేండ్లు అవుతున్నది. తరతరాల దారిద్ర్యాన్ని, అణచివేత, దోపిడీ దుష్ట ఫలితాలను అంతం చేసి బహుముఖ అభ్యుదయంతో సకలజనుల సౌభాగ్యం సాధించడానికి చిత్తశుద్ధితో అంకితమైన కేసీఆర్ ప్రభుత్వం ఏండ్ల తరబడి కొనసాగాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. ఇదీ ఒక సోకాల్డ్ జాతీయ పార్టీ బీజేపీ పాలనకు ఒక అచ్చమైన ప్రాంతీయ పార్టీ ప్రగతిశీల పాలనకు మధ్య ఉన్న తేడా! స్వతంత్ర భారత రాజ్యాంగం మూడు, నాలుగేండ్ల మేధోమథనం ఫలితంగా రూపొంది ఈ దేశానికి ప్రజాస్వామిక ఫెడరల్ వ్యవస్థను ప్రసాదించింది. ఫెడరల్ వ్యవస్థను పటిష్ఠపరిచే బదులు తూట్లుపొడిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రాంతీయ భావనలు, ప్రాంతీయ ఆశ లు, అభీష్టాలు, ఆవేశాలు, ప్రాంతీయశక్తులు జాతీయ సమైక్యతకు, దేశభక్తికి విఘాతం కలిగిస్తాయన్న దురభిప్రాయాల వల్ల దేశమంతటా తీవ్ర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అటానమీ - స్వయం ప్రతిపత్తి - ఆకాంక్షిస్తూ కొన్నేండ్ల కిందటి జమ్ము-కశ్మీర్ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తీర్మానాన్ని ఆమోదించినట్లయితే ఈరోజు ఆ రాష్ట్రం అగ్నిగుండం కాకపోయేది. కేంద్రం చట్టాలు విధానాలు, చర్యలు ఇంతకాలం రాష్ట్రాల, ప్రాంతాల ఆర్థిక క్షీణతకు, రాజకీయ అస్థిరత్వానికి సమిధలుగా ఉపకరించాయనడంలో సందేహంలేదు. కేంద్రం, జాతీయపక్షాలుగా, పార్టీలుగా చలామణి అవుతున్న పార్టీలు రాష్ట్రాల, ప్రాంతాల ఆకాంక్షలను, అస్తిత్వ ఆరాటాలను సకాలంలో గుర్తించి, గౌరవించి, జాప్యం లేకుండా చర్యలు తీసుకున్నట్లయితే దేశం పరిస్థితి భిన్నంగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం ప్రాంతీయ శక్తులు, ఆ శక్తులకు ప్రాతినిథ్యం వహిస్తున్న పార్టీలు వాటి గొంతు గట్టిగా వినిపించడానికి ఇరువై ఏండ్లయింది. 1967 నుంచే ప్రాంతీయశక్తులు రాజకీయంగా ప్రాబల్యం వహించడం మొదలైంది. క్రమంగా దేశమంతటా ప్రాంతీయపార్టీల అవతరణకు ప్రోత్సాహం కలిగించాయి. దేశమంతటా ప్రాంతీయ మనోభావాలకు కాహళులుగా ఉపకరించే ఎన్నో ప్రాంతీయపార్టీలు ఉబికివచ్చాయి.

బుద్ధుడు సందేశాలు



మౌనంతోనే ఆచరణ సాధ్యం

శారీరిక సుఖభోగాలలో మునిగి తేలడం మంచిదికాదు. కాని శారీరిక అవసరాలను నిర్లక్ష్యం చేసి, ఉన్న మాలిన్యాలపైన మరికొన్ని తెచ్చి పెట్టడం కూడా మంచిది కాదు. దీపాన్ని పరిశుభ్రం చేసి, మసి తుడిచి, నూనె పోయకపోతే జ్యోత ఆరిపోతుంది. అలాగే శరీరాన్ని శుభ్రంగా ఉంచకుండా, ఉపవాస వ్రతాలతో బలహీనపరిస్తే సత్య ప్రకాశాన్ని స్వీకరించే శక్తి దానికి ఉండదు. శరీరాన్ని ప్రేమించకుండానే దాని పట్ల శ్రద్ధ చూపాలి. దాని అవసరాలు తీర్చాలి. గాయాన్ని ప్రేమించకుండానే జాగ్రత్తగా దానికి చికిత్స చేస్తాం. అలాగే శరీరం విషయంలో కూడా జాగ్రత్త తీసుకోవాలి. నేను మధ్యే మార్గాన్ని బోధించాను. కఠోర నియమాలు, వ్రతాలు మధ్యమ మార్గానికి విరుద్ధమైనవి. ఎవరైనా, అతనికి యుక్తమని తోస్తే, మరింత కఠిన నియమాలను పాటించకుండా నివారించలే ము. కాని ఎవరినీ వాటిని పాటించవలసిందని నిర్భంధించకూడదు. ఎందుకంటే అని అనవసరమైనవి కాబట్టి." ఆ విధంగా దేవదత్తుని అభ్యర్ధనను బుద్ధుడు తిరస్కరించాడు. దేవదత్తుడు ముఖం మాడ్చు కొని తన విహారానికి తిరిగి వెళ్లిపోయాడు. బుద్ధుని మార్గం చాలా ఉదారంగాను, అసమ గ్రంగాను ఉందని దుష్ప్రచారం చేశాడు. దేవదత్తుని విమర్శలు బుద్ధుని చెవులబడ్డాయి. ఆయన ఇలా వ్యాఖ్యానించాడు. "మనుష్యుల లో నిందమోయని వాడంటూ ఎవడూ లేడు. మాట్లాడక మౌనంగా ఉన్నా విమర్శిస్తారు. మాట్లాడినా విమర్శిస్తారు. మధ్యే మార్గాన్ని బోధించేవాడిని కూడా వాళ్లు నిందిస్తారు. అది లోకం తీరు." దేవదత్తుడు తన కుటిల తంత్రాలను కొనసాగించాడు. అజాత శత్రు వును తండ్రిపై తిరగబడేటట్లు రెచ్చగొట్టాడు. "నీవు ఎంతకాలం తండ్రికి లోబడి బ్రతుకుతావు. తిరగబడు. సింహాసనాన్ని సొంతం చేసుకో, " అని బోధించాడు. అజాత శత్రువు అతని దుర్బోధలు విని, కుట్ర చేసి తండ్రి అయిన బిబిసారుని నిర్భంధించి చెరసాలలో పెట్టాడు. మగధ రాజ్య పాలనా బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకొన్నాడు. బింబిసారుడు చెరసాలలోనే మరణించాడు. దుష్టబుద్ధి అయిన దేవదత్తుడు అజాత శత్రువుకు ఇంకా సన్నిహితుడు అయ్యాడు. అతని దుర్బోధలు విని అజాత శత్రువు బుద్ధుని ప్రాణాలు హరించడానికి ఆదేశా లిచ్చారు. తతాగతుని చంపడానికి వెళ్లిన హంతకులు ఆ పాప కార్యం చేయలేకపోయారు. హృదయ పరివర్తన చెంది, బుద్ధుని ఉపదేశం విని బౌద్ధ మతం స్వీకరించారు. కాని బుద్ధునిపై హత్యా యత్నాలు ఆగలేదు. కొండపైనుంచి ఒక పెద్ద బండరాయిని ఆయనపైకి దొర్లించారు.

దిన ఫలాలు

ఆదివారం -18-3-2018

మేషం: ఆరంభించిన కార్యాలలో విజయం కలుగుతుంది. శుభ కార్యాలలో పాల్గొంటారు. పాత బాకీలు వసూలవుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగలాభం ఉంది.

వృషభం: మిత్రులతో ఏర్పడిన విబేధాలను పరిష్కారించుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ఇంటాబయటా ఎదురైన సమస్యలు, ఒత్తిడి .

మిథునం: చిన్ననాటి మిత్రులతో కలిసి ఆనందంగా గడుపుతారు. తండ్రి నుంచి స్థిరాస్తి లాభం పొందుతారు. నిరుద్యోగులు ఇంటర్వ్యూలలో పాల్గొంటారు.

కర్కాటకం: చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. సంఘంలో ఆదరణ లభిస్తుంది. ఇంటాబయటా అనుకూలంగా ఉంటుంది. విందువినోదాలలో పాల్గొంటారు.

సింహం: కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. వివాదాలకు దూరంగా ఉండడం ఉత్తమం. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు.

కన్య: ముఖ్యమైన వ్యవహారాలు నెమ్మదిగా సాగుతాయి. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం ఉత్తమం. బంధువులతో విభేదాలు ఏర్పడతాయి. వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

తుల: నూతన కార్యక్రమాలు, వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. చిన్ననాటి మిత్రులతో కలిసి ఆనందంగా గడుపుతారు. శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు.

వృశ్చికం: ప్రయాణాలలో కొత్త మిత్రుల పరిచయమవుతారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది. వాహనయోగం ఉంది. ఉద్యోగ, వివాహయత్నాలు కలిసివస్తాయి.

ధనస్సు: ఆర్థికలావాదేవీలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వివాదాలకు దూరంగా ఉండటం ఉత్తమం.

మకరం: దీర్ఘకాలిక రుణాలు కొంతవరకు తీరుస్తారు. ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి. నూతన మిత్రులు పరిచయమవుతారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి.

కుంభం: ప్రారంభించిన నూతన వ్యాపారాలను విజయవంతమవుతాయి. సంఘంలో గౌరవం పెరుగుతుంది. విలువైన వస్తువులు, వాహనాలు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు.

మీనం: ఆకస్మిక ప్రయాణాల వల్ల లబ్ది పొందుతారు. బంధువులతో కలిసి ఆనందంగా గడుపుతారు. మిత్రుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.



ఉగాది కోయిలల్ని ఆహ్వానిద్దాం!

ఉగాది కోయిలల్ని ఆహ్వానిద్ధాం!
కొత్త గాలులు కోకనుకట్టి
ఆమని అంచుల పైటను చుట్టి
వనమయూరముల
వయ్యారంలా...
ఉగాది పండగ సింగారంలా....
ఉగాది పండగ వచ్చింది!
హుషారు దండిగ తెచ్చింది!

ఆగమ ఆమని వింతలతో
సరాగమ మధురిమ పూతలతో
ప్రకృతి వన్నెలు విరిసిన వేళ!
కాలం కన్నీయ మురిసిన హేళ!!
నింగినేలా గాలినీరు
అన్నింటిలోన కాంతులతేరు!
తీగన విరిసే మల్లెమొగ్గలు...

లేత బుగ్గల వలపుసిగ్గులు.
ఇచ్చట అచ్చట ఎచ్చట చూడ
వెలుగు రేఖల వేకువ జాడ!!
ఉగాది పండగ వచ్చింది!
హుషారు దండిగ తెచ్చింది!!

పుడమీతల్లి కడుపు పండగ
పంటచేల పసిడి నిండుగ
ఆనందం ఐశ్వర్యం అడుగడుగున
నడయాడ
నవజీవన తాళంలో సమభావం
నాట్యమాట
జావళీల జాతరలో జానపదులు
పాట పాడ
ఉగాది పండగ వచ్చింది!
హుషారు దండిగ తెచ్చింది!!

ఉత్సాహం ఉల్లాసం ఉరకలు వేయ
ఎదెదతో నవ్వుల పువ్వులు,
జీవితమంతా జీవనమంతా
వెలుతురు పిట్టల వెలుగు రవ్వలు.
మావి చిగురుల వగరు తగలగ...


కోయిల "కుహు కుహు" పాటలు
తోడుగ
ఉగాది పండగ వచ్చింది!
హుషారు దండిగ తెచ్చింది!!

పంచాంగ శ్రవణం, కవిసమ్మేళనం
వసంతోత్సవం ఉగాది పచ్చడి
ఏరువాకలు దాపల ఎలపలు
పల్లెపట్టుల పచ్చందనాలు
మరదల పిల్లల వాలుచూపులు
కొంటె బావల కొసరు చేష్టలు
ఉగాది పండగ వచ్చింది!
హుషారు దండిగ తెచ్చింది!!

అందరమొకటై అంతా ఒకటై
సరంభావాలతో సంతోషాలతో
హేవళంబికి వీడ్కోలిద్ధా!
విళంబినేమో ఆహ్వానిద్దాం!!

- రమా ప్రసాద్ ఆదిభట్ల
డైరెక్టర్, డిడియు కౌశల్ కేంద్రం ఆఫ్ యూజీసీ

చరిత్రలో మార్చి 18



భారత ఆయుధ కర్మాగారాల దినోత్సవం.
1858 : రుడోల్ఫ్ డీసెల్, జర్మన్ ఆవిష్కర్త జననం (మరణం:1913).
1871 : భారత సంతతికి చెందిన ప్రముఖ గణిత మరియు తర్క శాస్త్రవేత్త అగస్టస్ డీ మోర్గాన్ మరణం (జననం:1806).
1922 : మహాత్మా గాంధీ కి, శాసనోల్లంఘన ఉద్యమం చేసినందుకు, 6 సంవత్సరముల జైలు శిక్ష విధించబడింది.
1837 : అమెరికా మాజీ అధ్యక్షుడు గ్రోవర్ క్లీవ్ లాండ్ జననం (మ.1908).
1938 : ప్రముఖ చలన చిత్ర నటుడు శశి కపూర్ జననం.
1965 : అలెక్షీ లియనోవ్ అనే రోదసీ యాత్రికుడు తన అంతరిక్ష నౌక వోస్కోడ్ 2 నుండి 12 నిముషాలు బయటకు వచ్చి, అంతరిక్షంలో నడిచిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచాడు.

శశి కపూర్ ఒక భారతీయ చలనచిత్ర నటుడు మరియు నిర్మాత. ఆయన మార్చి 18, 1938న కలకత్తాలో జన్మించాడు. కొన్ని సినిమాలకు దర్శకుడిగా, సహాయ దర్శకుడిగా కూడా పనిచేశాడు. 2011లో ఆయనకు భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. శశి కపూర్ నాలుగు సంవత్సరాల పిన్న వయసునుండే తండ్రి పృథ్వీరాజ్ కపూర్ స్థాపించిన పృథ్వీ థియేటర్స్ తోపాటు ప్రయాణిస్తూ ఆయన నిర్మించి, దర్శకత్వం వహించిన నాటకాలలో నటించడం ప్రారంభించాడు. 1940 దశాబ్దిలోనే సంగ్రామ్ (1950), దనపాణి (1953) లాంటి వ్యాపారాత్మక చిత్రాల్లో బాల నటుడిగా తన ప్రస్థానం ప్రారంభించాడు. అప్పట్లో శశికపూర్ పేరుతో పౌరాణిక చిత్రాల్లో నటించే మరో బాలనటుడు ఉండటంతో శశిరాజ్ అనే పేరుతో చిత్రరంగానికి పరిచయం అయ్యాడు. 1948లో వచ్చిన ఆగ్, 1951లో వచ్చిన ఆవారా సినిమాల్లో తన అన్న రాజ్ కపూర్ చిన్నప్పటి పాత్రను పోషించి మంచి పేరు తెచ్చుకున్నాడు. 1950లో వచ్చిన సంగ్రామ్ చిత్రంలో అశోక్ కుమార్ చిన్నప్పటి పాత్ర పోషించాడు. 1948-54 మధ్యలో నాలుగు హిందీ చిత్రాలలో నటించాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న శశి కపూర్ ముంబైలోని కోకిలబెన్ హాస్పిటల్లో 2017, డిసెంబర్ 4 (సోమవారం)న మరణించాడు.

శ్రీవేంకటేశ్వర వైభవము

ఆర్త త్రాణ వ రాయణుడై, ఆపద్బంధువై, జ్ఞానాద్రియని ప్ర ఖ్యాతి గాంచిన తిరుమల యందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి క్షేత్రపాలకుండగు రుద్రునకు మహా మహాశివరాత్రి దినమున పూజోత్సవములు జరుగును.

మహాశివరాత్రి దినమగు మాఘబహుళ చతుర్దశి రోజున సాయంకాలము అయిదు గంటలకు తీర్థవాసులు వచ్చి దేవస్థానం ఉద్యోగస్థులను పరివారములను గోగర్భతీరమునందు ప్రభూత శిలారూపముగానున్న క్షేత్రపాలకుని వద్దకు పిలుచుకుని వెళ్ళెదరు. అచ్చట ఏకాదశరుద్రముతో ఆ క్షేత్ర పాలకునకు అభిషేకము జరుగును. పిమ్మట వెండి ఊర్ధ్వపుంద్రమును నేత్రములను పెట్టి అలంకారము ఆరాధనము, నివేదనము చేసి హారతి చేయుదురు. అనంతరము ఆ నివేదితమైన, వడపప్పు, ఫలములు, టెంకాయలు, చందనము, తాంబూలము, మంత్రాక్షతలు, భూరిదక్షిణలు, అర్చకులకు ఏకాంగులకు, స్థానబహుమాన పూర్వకముగా వినియోగము జరిగి ఇతర భక్తులకు వినియోగము జరుగును. తరువాత అర్చకులు ఇతర కైంకర్యపరులు, ఉద్యోగస్థులు మంగళ్యాములతో శ్రీవారి దేవస్థానము మహాద్వారమునకు వచ్చి చేరెదరు. ఈ క్షేత్ర పాలకుడగు రుద్రుడు శ్రీస్వామివారి క్షేత్రమును చాలా కాలము పరిపాలించి పిమ్మట కారణాస్తరమున గోగర్భతీరమున శిలారూపముగా నున్నాడని సంప్రదాయ వేత్తలు ఎప్పుచున్నారు.

విప్లోత్సవము

అపారకారుణ్య జలధియై శేషాచలమునందు ఆశ్రిత రక్షణార్థమై అర్చావతారమున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి వారి పుష్కరిణియందు ప్రతి సంవత్సరము ఫాల్గుణశుద్ధ ఏకాదశి ప్రారంభముగా

క్షేత్రపాలక పూజోత్సవము



పూర్ణిమ వరకు అయిదుదినములు శ్రీస్వామివార్లకు ప్లవోత్సవములు ఉత్సవములు జరుగును. చేతనరక్షణార్థమై త్రేతాయుగాలంకారముగా అవతరించి ధర్మరక్షణ ముకావించిన శ్రీరామ చక్రవర్తిస్వామివారు ప్రథమదినమున సాయంకాలము శ్రీ సీతాలక్ష్మణులతో రత్నాభరణాద్యలంకృతులై సువర్ణ తిరుచ్చియందు వేంచేసి చతుర్వీథులు ఉత్సవము జరిగి శ్రీస్వామి పుష్కరిణియందుగల చిత్రాంతి చిత్రమై అనేక వద్యుద్ధీప భాస్వరమగు ప్లవమందు (తెప్పయందు) గల పీఠము నలంకరించెదరు. మంగళవాద్యములతోను,వేద ఘోషలతోను ఆ ప్లవము పుష్కరిణిలో ప్రదక్షిణముగా మూడు పర్యాయములు సంచారముచేసిన తరువాత హారతి అయి శ్రీ కోదండరామస్వామివారు శ్రీవారి సన్నిధానమునకు వేంచేయుదురు.

ధర్మరక్షణార్థమై ద్వాపరయుగాలంకారముగా నవతరించి చేతనో జ్జీవనార్థమై గీతోపదేశమొనరించిన శ్రీకృష్ణస్వామివారు శ్రీరుక్మిణీ అమ్మ వారు రత్నాభరణాద్యలంకృతులై రెండవ దినమున తిరుచ్చియందు వేంచేసి చతుర్వీథుల ఉత్సవము జరిగి శ్రీస్వామి పుష్కరిణియందుగల అతి రమణీయమగు ప్లవము యందు వేంచేసెదరు. వెంటనే మంగళవాద్యములతోను వేదపారాయణములతోను ఆ ప్లవము మూడు పర్యాయములు ప్రదక్షిణముగా సంచారము చేయును. తరువాత శ్రీస్వామివారికి హారతి అయి శ్రీవారి సన్నిధానమునకు వేంచేయుదురు.

కలియుగ ప్రత్యక్ష దైవమై మానవులకు కామితార్థ ప్రదానము చేయ నర్చావతారమున యవతరించిన శ్రీవేంకటేశ్వరస్వామివారు మూడవదినమున సాయంకాలము తిరుచ్చిలో శ్రీ భూదేవులతోసహా వేంచేసి చతుర్వీథులు ఉత్సవము జరిగి పుష్కరిణీయందుగల అతి భాస్వరమగు ప్లవము నలంకరించెదరు. ఆ పుష్కరిణియందు ప్రదక్షిణముగా మూడు పర్యాయములా ప్లవము సంచారము చేయును. శ్రీస్వామివారికి హారతి అయి శ్రీవారి సన్నిదికి వేంచేయుదురు.

సంచలన వార్తాపత్రిక
లీడర్ విశాఖపట్నం

విశాఖపట్నం | ఆదివారం 18-3-2018

తీరప్రాంత కోత నివారణ పనులకు శ్రీకారం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : జాతీయ సముద్ర అధ్యయన సంస్థ ఇచ్చిన సలహాలతో గత మూడేళ్లుగా తీరప్రాంత కోతను నివారించేందుకు రూ.40 కోట్లతో పనులు చేపట్టినట్టు విశాఖ పోర్టు చైర్మన్ ఎం.టి.కృష్ణబాబు తెలిపా రు. బీచ్‌లో జరుగుతున్న డ్రెడ్జింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుసుర సబ్‌మెరైన్ ప్రాంతంలోని సముద్ర తీరాన్ని రూ.18,37కోట్లతో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో పనులు చేపట్టినట్ట తెలిపారు. సముద్రంలో వచ్చే మార్పుల కారణంగానే తీర ప్రాంతం కోతకు గురవుతుందని ఆయన వివరించారు.

ధర్మాన్ని అనుసరించడమే 'రూల్ ఆఫ్ లా'

సుప్రీం కోర్టు జడ్జి శరద్ అరవింద్ బాబ్‌డే



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు జడ్జి శరద్ అరవింద్ బాబ్‌డే

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్:
ధర్మాన్ని అనుసరించడమే' రూల్ ఆఫ్ లా ' అని సుప్రీం కోర్టు జడ్జి శరద్ అరవింద్ బాబ్‌డే అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ వైఏస్. మూర్తి ఆడిటోరియంలో శనివారం జాస్తీ చలమేశ్వర్ ధర్మనిధి, రూల్ ఆఫ్ లా అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ఆయనతో పాటు సుప్రీం కోర్టు జడ్జి లావ్ నాగేశ్వరరావు తదితరులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా అరవింద్ బాబ్‌డే మాట్లాడుతూ భారత రామాయణం, భారతంలో వున్న ఉపనశక్తులలో చెప్పిన ధర్మసూత్రాలే భారతదేశం న్యాయవ్యవస్థలో వున్నాయని అన్నారు. ఎక్కడ ధర్మం వుంటుందో అక్కడ జయం కలుగుతుందన్నారు. ధర్మం అంటే ఒక భూభాగం, ప్రాంతానికి సంబంధం కాదని మెదడుకు, మనస్సు కు సంబంధించిదని చెప్పారు. సత్యమంటే ధర్మమని, ధర్మమమే సమాజానికి బలమన్నారు. ఒక వ్యక్తి స్వేచ్ఛను గానీ, జీవనాన్ని హరించే హక్కు ఎవరికి లేదని స్పష్టం చేశారు. రూల్ ఆఫ్ అంటే న్యాయస్థానాలే గుర్తుకొస్తాయని వెల్లడించారు. బలవంతుడు నుండి బలహీనుడిన్ని రక్షంచేది ధర్మం మాత్రమేనని వెల్లడించారు. ధర్మం అనేది ఎవరికి అతీతం కాదని, ఇరు వర్గాలలో ధర్మం వైపు నిలబడిన వారికే న్యాయం జరుగుతందని తెలియజేశారు. సుప్రీం కోర్టు జడ్జి నాగేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాది నుండి న్యాయమూర్తిగా ఎదగడానికి బాబ్‌డే మార్గసూత్రాలేనని, ఆయన మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. సుప్రీం కోర్టుకు వెళ్ళిన తర్వాత ప్రజల వివాదాల్లో అరవింద్ బాబ్‌డే నుంచి రోజుకో కొత్త విషయాలన్ని నేర్చుకొన్నానన్నారు. ఆయన అనేక సమస్యలు, ప్రభుత్వం ప్రజలకు అందించే పలు విషయాలపై కూడా అనేకమైన సూచనలు, సలహాలు, సమస్యలను పరిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రవిశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. నాగేశ్వరరావు, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ డిఎస్. ప్రకాశ్‌రావు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఏయూ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, లా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటును అందించాలి

పవన్ కళ్యాణ్ అసత్య ఆరోపణలు మానుకోవాలి - జిల్లా పార్టీ అధ్యక్షులు పంచకర్ల



మాట్లాడుతున్న పంచకర్ల, జగదీష్

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు, ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం ఉదయం బైపాస్‌రోడ్డులో గల ఎంపీ క్యాంపు కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు కలిసి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు నాలుగేళ్లగా చంద్రబాబునాయుడు పరిపాలన దక్షుడని, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న నేత అని, పలు సందర్భాల్లో కొనియాడిన పవన్‌కు ఎవరో చెప్తే చంద్రబాబు గురించి , ఆయన కుమారుడు లోకేష్ గురించి అసత్య ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి లోకేష్ బినామీ అని నోటికి వచ్చినట్లుగా మాట్లాడిన పవన్ దగ్గర సాక్ష్యాధారాలు ఉంటే బహిర్గతం చేయాలన్నారు. ఒక వ్యక్తిమీద బురద జల్లేటపుడు నీతి, నిజాయితి ఉండాలి కాని ఎవరో స్క్రిప్ట్ రాసి ఇస్తే మాట్లాడడం న్యాయం కాదన్నారు. కేంద్ర మంత్రులను రాజీనామా చేయమన్నావు, ఎన్‌డీఏ నుంచి టీడీపీ బయటకు రావాలని డిమాండ్ చేశావు, నీవు చెప్పిన వన్నీ చేశామని, తీరా ఇప్పుడు రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే తమతో కలిసి రావలసింది పోయి తిరిగి చంద్రబాబునాయుడుని విమర్శించి మాట్లాడితే తాము చూస్తూ ఊరుకునేదిలేదని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా అందరం కలిసి కేంద్ర ప్రభుత్వం వైఖరిపై పోరాటం చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. అంతేతప్ప బీజేపీ చెప్పినట్లుగా మాట్లాడితే టీడీపీ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తూ ఊరుకునేది లేదని ఆయన అన్నారు. ప్రజలు కష్ట సుఖాలు తెలియని పవన్ కళ్యాణ్‌కు చంద్రబాబునాయుడును విమర్శించే అర్హత లేదన్నారు. వ్యక్తిగతంగా మాట్లాడితే తాముా కూడా నీ వ్యక్తి బండారం బయట పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పంచకర్ల రమేష్ అన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తున్న కేంద్రాన్ని నిలదీయకుండా మిత్ర ధర్మాన్ని తప్పిన బీజేపీని విమర్శించకుండా, రాష్ట్రం ప్రగతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబును విమర్శించడం వెనకున్న అంతర్యామేమిటో అర్థంకావడంలేదని ఆయన అన్నారు. పవన్ కళ్యాణ్ మాట్లాడే ప్రసంగంలో దర్శకుడు, స్క్రీన్‌ప్లే, మాటల రచయితలు ఉన్నారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. సహచర మిత్రులను సైతం మోసం చేస్తున్న బీజేపీ చేతిలో పవన్ కళ్యాణ్ కీలుబొమ్మ కావద్దన్నారు. రాజకీయాలు చేయడం, ప్రభుత్వాలు నడపడం అంటే కెమేరా ముందు చిందులు వేసినట్లు కాదని పవన్ కళ్యాణ్ గుర్తించాలని నాగజగదీశ్వరరావు అన్నారు.

ఐటీ శాఖలో లోకేష్‌ది భారీ స్కామ్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ.సత్యనారాయణ మూర్తి

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్:
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనయుడు నారా లోకేష్ నిర్వహిస్తున్న ఐటీ శాఖలో భారీ స్కామ్ జరిగిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. శనివారం ఉదయం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని తక్కువ ధరకు అప్పగించారని పేర్కొన్నారు. దీనిలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని చెప్పారు. మధురవాడ సర్వే నెంబర్ 309 లో 40 ఎకరాల భూమిని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఇన్వెస్టమెంట్స్-ఇన్నోవా సొల్యూన్స్ కి అప్పనంగా అప్పగించారని అన్నారు.రూ.400 కోట్ల విలువైన ఈ భూమిని కేవలం రూ.13 కోట్లకే కేటాయించారని తెలిపారు.ఈ భూమి వాస్తవానికి ఎకరా ధర రివ్.10 కోట్లు ఉంటే ప్రభుత్వం మెసత్రంకెవలం ఎకరా ధర రూ.32.5 లక్షలకు కేటాయించిందని ఆరోపించారు.40 ఎకరాలకు 40,000 మందికి ఒక షిఫ్ట్ లోనే ఉపాది కల్పించవచ్చని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

ఆంధ్రప్రదేశ్‌కు రాయితీలతో కూడిన ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలిసిందేనని డిమాండ్ చేశారు. అలాగే విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు పై ఒడిస్సా ప్రభుత్వానికి, అక్కడి ముఖ్యమంత్రి కి కానీ ఎటువంటి వ్యతిరేకత లేదని స్పష్టం చేసిన నేపథ్యంలో విశాఖ రైల్వే జోన్ ప్రకటన వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏజె.స్టాలిన్, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, నగర కార్యదర్శి ఎం.పైడి రాజు, జిల్లా సహాయ కార్యదర్శి జెవి.ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ. విమల పాల్గొన్నారు.

పునర్విభజన చట్టంలో అంశాలు అమలు చేయాలి

బీజేవైఎం జాతీయ నాయకులు ఆదారి కిషోర్‌కుమార్



మాట్లాడుతున్న ఆదారి కిషోర్‌కుమార్

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్:
ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం లో అమలులో ఇచ్చిన హామీలపై కేంద్రం స్పందించాలని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జాతీ య కార్యవర్గ సభ్యుడు ఆదారి కిషోర్ కుమార్ కోరారు. నగరం లో ద్వారకానగర్ స్థానిక హోట ల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ కేంద్రం ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి సుముఖంగా వుందని స్పష్టం చేశారు. కొంత మంది వ్యక్తుల తప్పుడు సమాదా రాలతో కేంద్రం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం వలన రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని అన్నా రు. ఈ వ్యవహారాన్ని గ్రహించి ఆంధ్రప్రదేశ్ నుండి ఒక డెలిగే షన్‌ను ప్రధానిమంత్రి కార్యాల యానికి, అలాగే అరుణ్ జైట్లీకి ఆంధ్రప్రదేశ్ డిమాండ్‌లను స్వ యంగా వివరించడం ద్వారా ఇక్కడ ప్రజలకు మేలు జరుగుతుం దని భావిస్తున్నానని చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర దశాబ్దాల ఆకాంక్ష విశాఖ రైల్వేజోన్ ప్రకటించాలని కేంద్రాన్ని కోరారు. బీజేవైఎం తరుపున స్వయంగా ప్రధానీ మంత్రి కార్యాలయానికి వెళ్ళి ఇక్కడ వున్న స్థితిగతులపై వివ రించడానికి సిద్దంగా వున్నామని తెలిపారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి జాతర

మాడుగుల, న్యూస్‌లీడర్:
మాడుగులలో నూకాలమ్మ కాలనీలో వెలసిన శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో శనివారం ఉదయం నూకాలమ్మ జాతర ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎలమంచిలిలో.. కొత్త అమావాస్త పురస్కరించుకొని శనివారం శ్రీనూకాలమ్మ గుడి వద్ద అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఎలమంచిలి పట్టణంలో బస్టాండ్ సమీపంలో శ్రీనూకాలమ్మ గుడివద్ద ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు క్యూగట్టి రద్దీ ఏర్పడింది. కొత్తపాలెం, జంపపాలెం, సోమలింగపాలెం, పెదపల్లి, కొక్కిరాపల్లి తదితర గ్రామాలలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో క్యూకట్టి వేచి ఉన్నారు.

బుచ్చెయ్యపేటలో.. కొత్తఅమావాస్య సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నూకాంభిక అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు.ఆయా గ్రామాల్లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఎర్రవాయిలో ప్రసిద్ది చెందిన కేపీ అగ్రహారం నూకాంభిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం నుండే అమ్మవారి జాతర ప్రారంభమైంది. మహిళలు పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు తీర్చుకు న్నారు. అదేవిధంగా శనివారం కొత్త అమావాస్యను పురస్కరించుకుని వడ్డాది, విజయరామరాజుపేట, రాజాం, సీతయ్యపేట, పెదపూడి తదితర గ్రామాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొత్త అమావాస్య, ఉగాది పండుగలను పురస్కరించుకుని వలస కూలీలు తమ స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి.



మాడుగులలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

ఎన్‌ఏడిలో.. స్థానిక జీవీఎంసీ 37 వార్డు భారత్ నగర్ బర్మా క్యాంపు నందు వెలసిన శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు శనివారం శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి అమ్మవారికి విశేష అర్చనలు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు కు ఇలవేల్పైన కొంగు బంగారమైన నూకాలమ్మ అమ్మవారికి వారివారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి ఘటాలు పురవీధుల్లో ఊరేగించి అమ్మవారి ఆలయం వెలుపలకు తీసుకొని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో గ్రామ అధ్యక్షుడు బొగ్గ శ్రీను, బొడ్డేటి నాగు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గాజువాకలో.. జీవియంసి 68వ వార్డులో నూకాలమ్మ అమ్మవారి ఉత్సవ ఊరేగింపును భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 36 ప్రతిమలతో పాటుగా పులి వేషాలు, కోళ తాళ మేళాలతో అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

గోపాలపట్నంలో.. గోపాలపట్నం ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర శనివారం అంగరంగవైభవంగా జరిగింది. 14 గ్రామాలకు ఆరాధ్యదేవత పొలిమేర దేవత శాంతస్వరూపిని శ్రీనూకాలమ్మ పండగను కొత్త అమావాస్య పర్వదినం నాడు తెలుగు ప్రజలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

పోలవరం ప్రాజెక్ట్‌పై సీబీఐతో దర్యాప్తు చేయించాలి

అధికార పార్టీ నేతలకు ఆదాయవనరులుగా నీటిపారుదల ప్రాజెక్టులు

జనచైతన్య రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్:
జాతీయ ప్రాజెక్ట్ పోలవరంపై సీబీఐ ఎంక్వైరీ జరి పించాలని జనచైతన్య రాష్ట్ర అధ్యక్షుడు వి. లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. విశాఖ పౌరగంథ్రాలయంలో శనివారం నీటిపారుదల ప్రాజెక్టల అమలు తీరు అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రదానంగా ఆంధ్రద్రేశ్‌లో అధికార పార్టీ నాయకులకు నీటీపారుదల ప్రాజెక్టులు ఆదాయవనరులుగా మారాయని ఆరోపించారు. ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టుకోవాడానికి వీటిపై సంపాదిస్తున్నారని అన్నారు. నీటిపారుదల ప్రాజెక్టలలో కాంట్రాక్ట్ బినామీలతో కోట్లాది రూపాయాలు సంపాదించుకుంటున్నారని అన్నారు. కాని ప్రాజెక్టలు మాత్రం పూర్తి చేయడంలో శ్రద్ధ వహించడంలేదన్నారు. వీటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు, బంధువులకు కాంట్రాక్టలు ప్రాజెక్టలు అప్పజెప్పి దోచుకుంటున్నా రన్నారు. పోలవరం ప్రాజెక్టను పరిశీలిస్తే పూర్తి కావాడానికి చాలా ఎళ్ళు పడుతుందని, నిర్వాసితులు న్యాయం ఎప్పుడు జరుగుతుంది, త్రాగు నీరు అందలంటే ఇంకా పదిశాతం కూడా పూర్తి కాని పోలవరం ఎప్పటికి పూర్తిఅవుతుందని ప్రశ్నించారు. తక్షణమే కేంద్రం ప్రభుత్వం జోక్యం చేసుకుని పోలవరం ప్రాజెక్టను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మణరెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇఏఎస్ శర్మ, మాజీ చీఫ్ ఇంజనీర్స్ యు. నారయణ మూర్తి రాజు, యస్. సత్యనారాయణ హాజరై ప్రసంగించారు.

సిట్ దర్యాప్తు నివేదికను సీఎం విడుదల చేయాలి

లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అంతులేని అవినీతితో అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేల అండతో విశాఖలో జరిగిన భూకబ్జాల రికార్డులు తారుమారు తదితర అంశాలపై దర్యాప్తు కోసం ప్రభుత్వం నియమించిన సిట్ కమిటీ రిపోర్టును సీఎం చంద్రబాబునాయుడు వెంటనే విడుదల చేయాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేసారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల తో మాట్లాడుతూ సిట్ అధికారి వినీత్‌బ్రిజాల్ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసి మూడు నెలలు కావస్తున్నా ప్రభుత్వం మా త్రం నేటికీ విడుదల చేయ్యకుండా తాత్సారం చేయడం వలన అనేక అనుమానాలకు తావిస్తుందని ఆయన అన్నారు. తమ పార్టీ నష్టపోయిన రైతుల తరుపున సిట్ అధికారికి నివేదికలు అందించామని పెద్దలు చేసిన తప్పుడు పనులకు పేదరైతులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. సీఎం తక్షణమే సిట్ నివేదికను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈకార్య క్రమంలో పార్టీ రాష్ట్ర ప్రతినిధి ఎంఎస్ఎస్.మూర్తి, వడ్డి హరిగణేష్, గౌరీశంకర్ పి.శంకర్, ఎస్.శ్రీనివాస్, రాజేశ్వరి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విళంబినామ సంవత్సర శుభాకాంక్షలు



సింహాచలం లక్ష్మీనరసింహస్వామిని టీవీ, తెలుగు చలన చిత్ర హాస్యనటులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సింహాచలంలో సందడి నెలకొంది

ఆలయ అభివృద్ధికి చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డితో కలిసి నూకాంబిక అమ్మవారిని దర్శించుకొని ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రాష్ట్రాన్ని మరింత అభివృద్ధిపథంలో నడి పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అమ్మవారి ఆశీ స్సులను అందజేయాలని కోరడం జరిగిందన్నారు. విశాఖజిల్లా పారిశ్రామి కంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధిపథంలో ముందుండాలని, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని కోరామని అన్నారు. ప్రభుత్వం తరపున అమావాస్య రోజున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే విధంగా మనస్సు మారాలని అమ్మవారి ఆశీస్సులు కోరినట్లు ఆయన తెలిపారు. నూకాంబిక అమ్మవారి దర్శించుకుంటే ప్రజలు కోరుకునే కోర్కెలు తీరుతాయనే విషయాన్ని తాను విన్నానని, అదే విధంగా రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజానీకాన్ని సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుద్ధ నాగజగదీశ్వరరావు, మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ డిప్యూటీ కమిషనర్ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ సహాయ కమిషనర్ ఎస్.సుజాత, వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ కృష్ణ ప్రసాద్‌జీ, పార్టీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, ఆడారి జగన్నాథరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొణతాల రత్నకుమారి, మళ్ల సత్యనారాయణ, బొడ్డేద మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా...

గత ఎన్నికల ముందు తిరుపతి వెంకన్న సాక్షిగా తాను అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని మాట ఇచ్చి మాట తప్పిన నరేంద్రమోదీ ప్రభుత్వానికి పుట్టగతులుండవని రాష్ట్ర మంత్రులు సీహెచ్ అయ్యన్నపాత్రుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌లు అన్నారు. శనివారం ఉదయం శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన వారిని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం ప్రభుత్వం అవిశ్వాసం పెట్టడంతో దేశవ్యాప్తంగా అన్ని పార్టీలలో నమ్మకం కలిగిందన్నారు. వైఎస్సార్ సీపీ అవిశ్వాసానికి నోటీసు ఇచ్చిందంటే భారతదేశంలో ప్రజలు నమ్మలేదన్నారు. చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వంపై ప్రకటించిన అవిశ్వాస తీర్మానానికి దేశంలో 40శాతం ఎంపీలు మద్దతు పలికాయన్నారు. దీంతో నరేంద్రమోదీ దడ పుట్టిందన్నారు. రాజకీయ వ్యాభిచారం చేయకుండా మోదీ చేసిన తప్పులను ఇప్పటికైనా సరిదిద్దుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను తన స్వంత రాష్ట్రంగా చూసుకుంటానని ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చి గద్దెనెక్కిన తరువాత ఆ మాటను మార్చడం ఎంతవరకు సమంజసమని వీరు ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం పోరాడుతానని చెబుతున్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నరేంద్రమోదీ గురించి మాట్లాడుతూ చంద్రబాబు గురించి మాట్లడటం విడ్డూరంగా ఉందన్నారు. విజ్ఞత కలిగిన సీనియర్ నాయకుడు చంద్రబాబునాయుడు ఎన్‌డీఏ నుంచి బయటకు వచ్చి అవిశ్వాసం తీర్మాణం పెడితే దేశంలో అన్ని పార్టీలకు ధైర్యం వచ్చిందన్నారు. మోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మాణానికి చర్చ జరుపుతాదని తాము అనుకోవడంలేదని మంత్రులు అయ్యన్న, చంద్రమోహన్‌రెడ్డిలు అన్నారు.

దేశం ఏపీ వైపే చూస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎంపీలతో చంద్రబాబు శనివారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్ సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. పీఎంవో చుట్టూ ఏ2 చక్కర్లు కొట్టడంతో అవిశ్వాసం అన్న వైకాపాను ఎవ్వరూ నమ్మలేదని చంద్రబాబు విమర్శించారు. కేసుల మాఫీకే విజయసాయి రెడ్డి పీఎంవోలో తిరుగుతున్నారని ఆరోపించారు. కేంద్ర పెద్దలకు పాదాభివందనాలు, ప్రదక్షిణలు కేసుల మాఫీ కోసమేనని దుయ్యబట్టారు. ఇప్పుడే జగన్ కేసులకు సడలింపులు ఎందుకు వస్తున్నాయని కేంద్రాన్ని ప్రశ్నించారు. జగన్ అనుచరులు పీఎంవోలోనే ఉంటున్నారని.. దానికి ప్రతిగానే కేసులలో సడలింపులని ఎంపీలతో అన్నారు. రేపోమాపో జగన్ కేసులు కొట్టివేస్తారనే ప్రచారం జరుగుతోందని చంద్రబాబు చెప్పారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని.. తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. తెదేపా అవిశ్వాసానికి అనేక పార్టీలు మద్దతు ఇస్తున్నాయని..అవిశ్వాసంపై ఓటింగ్‌కు పట్టుబట్టాలని, డివిజన్ అడగాలని పార్టీ ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఆరుగురు సభ్యుల ఎంపీల బృందం ఈ రెండురోజులు ఢిల్లీలోనే ఉండాలని ఆదేశించారు. అన్ని పార్టీల నేతలను వ్యక్తిగతంగా కలిసి, అవిశ్వాసానికి మద్దతు కూడగట్టాలన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నామన్న ఆయన.. మూడు పార్టీల మహా కుట్రను ప్రజల్లో బయటపెట్టామని చెప్పారు. జగన్, పవన్ కేంద్రాన్ని ప్రశ్నించకుండా తనను విమర్శించటమేమిటని చంద్రబాబు మండిపడ్డారు. ఈ సమయంలో తనను బలహీనపరిచే ప్రయత్నం చేసి ఎవరికి లాభం చేకూరుస్తున్నారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తోందన్న సీఎం.. జాతీయ స్థాయిలో ఏపీ ప్రజల గొంతు వినిపించామని అభిప్రాయపడ్డారు. తమకు కావాల్సింది రాజకీయం కాదని.. రాష్ట్రానికి న్యాయం జరగడమే తమ లక్ష్యమని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు.

హుద్‌హుద్ స్ఫూర్తి గుంటూరులో ఏమైంది

మున్సిపల్ అధికారులపై మండిపడ్డ చంద్రబాబు

గుంటూరులో కలుషిత నీటి వల్ల 10 మంది దుర్మరణం చెందడం బాధాకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనకు శాఖాపరమైన వైఫల్యమే కారణమని అన్నారు. మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక వ్యక్తి వైఫల్యం వల్ల 10 మంది చనిపోయారని అన్నారు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు దాన్ని చక్కదిద్దేంత వరకు విశ్రమించరాదని చెప్పారు. విశాఖను హుదూద్ తుపాను అతలాకుతలం చేసినప్పుడు... మనమంతా ఎలా చేశామని... గుంటూరులో ఆ స్ఫూర్తి ఏమైందని ప్రశ్నించారు. అధికారుల పనితీరు ప్రభుత్వ గౌరవాన్ని పెంచేలా ఉండాలని చెప్పారు. అలసత్వం ప్రదర్శించే అధికారులను సహించబోనని హెచ్చరించారు. రోడ్లను తవ్వడం, గుంతలను అలాగే వదిలేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. వైపు లైన్ల లీకేజీలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, మురుగు కాల్వలను వెంటనే శుభ్రపరచాలని ఆదేశించారు.

వెంకటేశ్వర్లుపై బిగుస్తున్న ఉచ్చు

విశాఖపట్నం,న్యూస్ లీడర్ :

అధికార దుర్వినియోగానికి పాల్పడి, రెవెన్యూ యంత్రాంగానికే మచ్చతెచ్చేలా వ్యవహరించి సస్పెండ్‌కు గురైన ఎస్.వెంకటశ్వర్లుపై ఉచ్చు మరింత బిగిస్తోంది. ఈ నెల 14 వ తేదీన సస్పెండ్‌కు గురైన ఆర్డీవోపై తాజాగా శనివారం క్రిమినల్ కేసు నమోదు అయింది. సాక్షాత్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ సృజన ఆర్డీవో వ్యవహారంపై మరింత దృష్టిసారించడంతో పాటు శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించడంతో పాటు, ఈయన వ్యవహారాన్ని మరింత లోతుగా పరిశీలన జరిపేలా పట్టు బిగించారు. దీంతో ఆర్డీవో పాపం పెంటాడి ఆయన హయాంలో జారిచేసిన తొమ్మిది అర్డర్లపై సమగ్ర దర్యాప్తు ఊపందుకుంటోంది. ఆర్డీవో స్థాయి అధికారిపై ఇలా క్రిమినల్ కేసు నమోదు కావడం జిల్లాలోనే తొలిసారి కావడంతో ఒక్కసారిగా జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఉలిక్కిపడుతోంది.

రెవెన్యూ డివిజన్ అధికారిగా,మెజిస్ట్రేట్ హోదాలో పారదర్శక పాలన అందించాల్సిన ఆర్డీవో తమ హోదాని, ధర్మాన్ని విడిచి చట్టానికి విరుద్ధంగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రయివేటు వ్యక్తులకు అనుకూలంగా పలు అర్డర్లు ఇవ్వడంపై ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఈ విషయమై ఆరా తీయడం, కలెక్టర్ దాకా ఈయన బాగోతం తీసుకువెళ్లడంతో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఈ నెల 7 వతేదీన ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన్ని సస్పెండ్ చేస్తూ రెవెన్యూ కార్యదర్శి ఈ నెల 14 వతేదీన సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో ఆయన్ని ఇంటికి సాగనంపారు. అనంతరం ఆయనపై సమగ్ర విచారణకు అధికారులు రంగంలోకి దిగారు. ఈమేరకు ఎంవీపీ కాలనీలో ఆయన ఇంటిని సీజ్ చేయడంతో పాటు నగర పోలీస్ కమిషనరేట్‌లో ప్రస్తుత ఆర్డీవో గోవిందరాజులు, మాజీ ఆర్డీవో వెంకటేశ్వర్లుపై క్రిమినల్ కేసు పెట్టారు. దీంతో గత మూడేళ్లుగా వెంకటేశ్వర్లు పాల్పడిన అక్రమాలపై లోతుగా దర్యాప్తు జరుగుతోంది. పెందుర్తి , ఆనందపురం, భీమునిపట్నం, విశాఖ రూరల్ మండలాల పరిధిలో ఆర్డీవో హోదాలో వెంకటేశ్వర్లు ఇచ్చిన తొమ్మిది అర్డర్లుపై పునర్ పరిశీలన చేస్తున్నారు.అయితే కేవలం తొమ్మిది అర్డర్లుపైనే విచారణ చేస్తారా ? లేదా గతంలో ఆయన హయాంలో జారీ చేసిన మొత్తం అర్డర్లుపై ఆరా తీస్తారా ? అన్నది ఇప్పుడ చర్చనీయాంశంగా మారింది. తీగ లాగితే డొంక కదిలినట్లుగా వెంకటేశ్వర్లు బాగోతం ఒక్కొక్కటిగా వెలుగుచూస్తోంది.


ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షుడుగా వెంకటరమణ



గాజువాక,న్యూస్‌లీడర్ :

దశాబ్దాలు కాలంగా చిరంజీవి యువత ప్రతినిధిగా సేవలందిస్తున్న పోల రౌతు వెంకటరమణ ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెగా బ్రదర్ నాగబాబు సూచన మేరకు వెంకటరమణను ఉత్తరాంధ్ర అధ్యక్షుడుగా ప్రకటించారు. ఈమేరకు అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రవనం స్వామినాయుడు అభిమానుల నడుమ వెంకటరమణను సత్కరించారు. ఈసందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ చిరంజీవి ఆశయసాధనకు అభిమానులు, చిరంజీవి యువత ప్రతినిధులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ తనకు భాధ్యతో కూడిన పదవిని కట్టబెట్టి మరింత భాధ్యతలు పెంచారన్నారు. ఈనెల18న ఆర్‌కె బీచ్‌లవద్ద జరగన్ను మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్ నటించిన రంగస్థలం ఆడియో ఫంక్షన్‌ను విజయవంతం చేయాలని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. అక్కడే రవనం అధ్యర్యంలో చిరంజీవి అభిమానుల సమావేశం జరగనుందన్నారు. ఈకార్యక్రమంలో కొయిలాడ శ్రీనివాసరావు,పలు జిల్లాల అభిమానులు, దేముడు, బొంతు కనకరాజు,నర్సింగ్, పల్లా కనకరాజు,సింధియా రవి ,రాము పాల్గొన్నారు.

ఎస్‌సీఆర్‌డబ్ల్యూఏ ఉగాది డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి గంటా

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉగాది 2018 డైరీ ని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యుత్తమమైన ఫోర్త్ ఎస్టేట్ లో ఎల్లప్పుడూ బిజీ గా ఉండే విలేకర్లు సమాజ సేవలో ఉండడం ప్రశంసనీయమన్నారు.స్మార్ట్ సిటీ విశాఖ లో అదే స్మార్ట్ సిటీ పేరుతో అసోసియేషన్ ఏర్పాటు చేసి విలేకర్ల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడడం గర్వనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో పనిచేసే విలేకర్ల సంక్షేమం కోసం స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సురేష్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రిషి,కోశాదికారి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి సత్య,కమిటీ మెంబర్ విజయ్ ,సీనియర్ పాత్రికేయులు దొండా రమేష్, సభ్యులు శరత్, వినోద్,రాజేష్,కె.వీరేంద్ర యాదవ్ ,గోవింద్ యాదవ్ పాల్గొన్నారు.

గంట్లకు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షులు, రాష్ట్ర జర్నలిస్టుల సమాఖ్య కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. ఆదివారం ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా శ్రీనుబాబు ఈ అవార్డు స్వీకరించనున్నారు. జర్నలిజం (సేవారంగం)లో శ్రీనుబాబు చేసిన సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారం ప్రకటించింది. గతంలో రాష్ట్రపతి అభినందనలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వివిధ సంస్థల నుంచి ఇప్పటివరకు శ్రీనుబాబు 23 అవార్డులను స్వీకరించారు.

ఇందులో ప్రతిష్టాత్మకమైన ఢిల్లీ తెలుగు అకాడమీ నుంచే మూడు అవార్డులను కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిజంలో తనకు రాష్ట్ర ప్రభుత్వ అవార్డు దక్కటం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. తన 21 ఏళ్ల పాత్రికేయరంగంలో ఇప్పటివరకు పలు పురస్కారాలు పొందటం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ అవార్డును విశాఖ జిల్లా జర్నలిస్టులకు అంకితమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. భవిష్యత్‌లో కూడా జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.

బి న్యూ మొబైల్స్ షోరూం ప్రారంభం



విజయనగరం : మొబైల్ విక్రయరంగంలో తనదైన స్థానాన్ని సంపాదించుకొని శరవేగంగా విజయపథంలో దూసుకువెళ్తున్న బి న్యూ మొబైల్స్ తన 50వ షోరూంను శనివారం స్థానికంగా ప్రారంభించారు. ప్రముఖ సినీనటి తమన్నా ప్రత్యేకఅతిథిగా విచ్చేసి ఈ షోరూంను ప్రారంభించడం ఆకర్షణీయంగా నిలిచింది. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ ఈ షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా విజయనగరం రావడం, ఇక్కడ ప్రజలను కలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కొత్త షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యే ఆఫర్లను ప్రవేశపెట్టారని, అధునాతన ఫీచర్స్‌తో కూడిన మొబైల్స్ కూడా ఇక్కడ లభిస్తాయని, వీటిని సద్వినియోగించుకోవాలని కోరారు. సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.డీ.బాలాజీ చౌదరి మాట్లా డుతూ కస్టమర్ల అపారమైన విశ్వాసం, ఆదరణ విజయప్రస్థానానికి ప్రధాన కారణమన్నారు. షోరూంలో రూ. 499నుండి రూ. 1,00,000 వరకు విలచేసే మొబైల్స్, యాక్సెసరీస్, 4జి టాబ్లు, లాప్‌టాప్లు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో 100షోరూంలు స్థాపించడమై లక్ష్యమని స్పష్టం చేశారు.



Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832